

# ది బెట్

"రేప్‌లో ఎన్ని రకాలున్నాయో తెలిసేలా చేస్తాను డియస్పీ కూతురికివాళ" స్పోర్ట్స్ షూ లాడు క్కుంటూ ప్రకటించాడు హర్ష.

"పిచ్చి, అదేమన్నా రోడ్ మీద పోయే అమ్మాయి భుజం గిల్లడ మనుకున్నావా" తేలిగ్గా అన్నాడు కులకర్ణి.

"నా మాట నేను నిజం చేసి చూపించినపుడు తెలుస్తుంది. అది నువ్వు చెప్పిందాని కంటే ఈజీ అని" సదముగా అన్నాడు హర్ష.

"ఆర్యూ సీరియస్?" అడిగాడు కులకర్ణి.

"య్యా... క్వయిట్" హర్ష జవాబిచ్చాడు.

."హర్షా! డోంట్ బి ఎస్టుపిడ్.. డియస్పీగారమ్మాయి అమల కేవలం డియస్పీ డాటరే కాదు. కాబోయే ఐ.పి.ఎస్. ఆఫీసర్.ఆ సంగతి తెల్సా నీకు" వారించాడు రావ్.

"ఏమి బెట్?" అడిగాడు హర్ష.

"త్రీ తవుజెండ్ బక్స్" కులకర్ణి చెప్పాడు.

"డన్... రావు ఈజ్ మీడియేటర్" ఉత్సాహంగా అన్నాడు హర్ష.

కులకర్ణి, హర్ష చెరి మూడు వేల రూపాయిలు రావు దగ్గర డిపాజిట్ చేశారు. ఆ విధంగా ఇంజనీరింగ్ చదివే ఆ ముగ్గురు విద్యార్థుల మధ్యా బెట్ ఖాయమయింది.

* * *

బీచ్ షోర్ ... ఉదయం అయిదు గంటలు.

అమల జాగింగ్ చేస్తూ ముందుకు సాగిపోతోంది. ఆమెకు కొద్ది దూరంలో వెనుకే ఫాలో అవుతున్నారు హర్ష, కులకర్ణి, రావ్. అప్పటికి వాళ్ళ మధ్య పందెం కుదిరి అయిదు నిముషాలు అవుతుంది.

"కమ్ విత్ మీ అండ్ లెట్స్ ఎంజాయ్ ది హేపెనింగ్స్" చెప్పాడు హర్ష కాస్త వేగం పెంచుతూ.

"హర్షా! నా మాట విను ప్లీజ్. ఇద్దరూ విత్‌డ్రా అయిపోండి. ఇంత డేంజరస్ టాస్క్ మనకు వద్దు" రావు మాటలు ఇంకా పూర్తి కాలేదు. హర్ష వడివడిగా వెళ్ళి అమలను అ పేశాడు.

రావ్‌తో పాటు కులకర్ణి గుండె కూడా టక టకా కొట్టుకుంది. తనీ బెట్ కాసి పొరపాటు చేశాడా? హర్ష మొండితనం తనకు తెలీంది కాదు. ఇప్పుడు ఏం చేస్తాడో, ఏమో ... చెప్పరాని ఉత్కంఠ అనుభవిస్తున్నట్టు అంత చల్లటి గాలిలోనూ అతడి ముఖంపై ఆవిర్భవించిన స్వేద బిందువులు స్పష్టం చేస్తున్నాయ్.

"నేను పొరపడకపోతే మీరు అమల... డియస్పీగారమ్మాయి కదూ" అంటున్నాడు హర్ష- కులకర్ణి,రావ్ అక్కడికి చేరుకునేసరికి.

"ఎస్" చెప్పింది అమల.

"మీరు హిందూ కాలేజి స్టూడెంట్ కదండీ. మీ నేటివ్ ప్లేస్ మచిలీపట్నం. అఫ్‌కోర్స్ మాదీ ఆ ఊరే!" చెప్పాడు హర్ష.

"అవును" అందామె కాస్త నిదానంగా.

కులకర్ణిని, రావుని పరిచయం చేశాడామెకు. అయోమయ స్థితిలో "హలో" అన్నారిద్దరూ.

"మా పూరికి చెందిన అమ్మాయి ఐ.పి.ఎస్. ఆఫీసర్ కావడం నాకు గర్వంగా ఉందండి. మన దేశంలో లేడీ పోలీసాఫీసర్ల అవసరం ఎంతయినా వుంది. ముఖ్యంగా మహిళల సమస్యలు మరో మహిళ అయితేనే అర్థం చేసుకోగలదు. రెండేళ్ళ క్రితం... చీకటిపడ్డాక కాలేజి ఫంక్షన్ నుంచి తిరిగి వస్తున్న మా కజిన్ ఓ దుర్మార్గుడి ఘాతుకానికి బలయిపోయి సూయిసైడ్ చేసుకున్నప్పుడు మీ లాంటి లేడీ ఆఫీసర్ అక్కడ వుండి వుంటే ఆ క్రూక్ ఈ రోజు బయట తిరగగలిగేవాడే కాదు" హర్ష కంఠంలోని జీరకూ, అతడి కళ్ళలో స్వల్పంగా మెరిసిన తడికీ విచలితురాలైంది అమల.

"సారీ" అంది మెల్లగా.

హర్షకు అసలు కజిన్సే లేరని తెలిసిన కులకర్ణి, రావ్ మాత్రం నోళ్ళు వెళ్ళబెట్టి చూడ్డం మినహా మరేమీ చెయ్యలేకపోయారు.

"మీరు స్త్రీలపై జరిగే అత్యాచారాలను ముఖ్యంగా అరికట్టాలని నా కోరిక. ఈ బుక్ మీకేమయినా ఉపయోగపడుతుందేమో చూడండి..."

తన ట్రాక్ సూట్ అప్పర్ లోంచి ఓ మాంచి ఫారిన్ బుక్ తీసి అమలకు ఇస్తూ అన్నాడు హర్ష. ఆ పుస్తకం చూస్తూనే ముందు షాక్ కొట్టినట్టయి బిగుసుకు పోయింది కులకర్ణి, ఆ తర్వాత రావు.. 'త్రీ తవుజెండ్ బక్స్ గాన్' అను కుంటూ.

ఇంతకూ ఆ పుస్తకం పేరు "వేరియస్ టైప్స్ ఆఫ్ రేప్స్ అండ్ హౌ టూ ప్రొటెక్ట్ ఇట్" (వివిధ రకాల రేప్‌లు, వాటి నుంచి రక్షించుకొను విధానములు.)

"తప్పకుండా" అంటూ ఆ బుక్ తీసుకుని రిఫర్ చేస్తూ "బై" చెప్పేసి వెళ్ళిపోయింది అమల.

అతడే కనుక నైపుణ్యంగా కజిన్ మరియు ఆమె రేప్ అనే కథ వినిపించకపోయినట్టయితే అలాంటి పుస్తకం ప్రొద్దుటే తెచ్చి ఇచ్చినందుకు షూతో (చెప్పుల్లేవు గనుక) వాయగొట్టుండేది అమల.

అట్టహాసంగా నవ్వుతూ "ఏం బాస్... డియస్పీ కూతురికి రేప్‌లో ఎన్ని వెరైటీ లున్నాయో తెలిపి నట్టేనా" అన్నాడు హర్ష.

నీరసంగా తలూపాడు కులకర్ణి.

— పి.వి. సునీల్ కుమార్